# జెన్ జీరో ఇంక్

– నిర్మలాదిత్య



## నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత –

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్థల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

## ‘గోవింద ఆలా రే...’

“ఒన్ ప్లస్ ఒన్ ఎంత,” అడిగింది ఆయషా.

“టూ, అయినా ఎందుకడుగుతున్నావు?” అడిగింది లక్ష్మి.

“ఇక్కడ నాకు మూడు లేక ఇంకా పెద్ద సంఖ్య వస్తుంది,” ఆయషా ఫ్రస్టేషన్ తో అంది.

జెన్ జీరో ఇంక్ క్లయింట్ లు ఇచ్చే ఇన్వెస్టిగేషన్ పనులతో బాటు, ఆర్థిక రంగంలో రీసెర్చ్ కూడా చేస్తూ ఉంటుంది. ఆయషా మార్కెట్లో బాగా పనిచేస్తున్న హెడ్జ్ ఫండ్ కంపెనీలు రీసెర్చ్ చేస్తుంటే, శాల్ బెర్గ్ నడుపుతున్న హెడ్జ్ ఫండ్ అంతు బట్టటం లేదు. అదే లక్ష్మితో ఇప్పుడు మాట్లాడుతుంది.

"వివరాలు చెప్పు. శాల్ బెర్గ్ హెడ్జ్ ఫండ్ గురించే కదా నీ ప్రశ్న? ఆ హెడ్జ్ ఫండ్ 100% పెట్టుబడిని పెంచుతున్నదని తెలుసు. అది ఆ కంపెనీ రిపోర్టులు చూస్తూనే తెలిసిపోతాయి. ఏ ఫైనాన్స్ వెబ్ సైట్ కు వెళ్లి చూసినా ఆ సంఖ్యలు విశదంగా వివరించి ఉంటారు."

"ఆ వెబ్ సైట్ సంఖ్యలు శాల్ బెర్గ్ కంపెనీ రిపోర్ట్ లో నుంచే వచ్చాయి కాబట్టి అక్కడ సమస్య లేదు. కానీ నేను ఆ హెడ్జ్ ఫండ్ లాభాలు ఎక్కడ నుంచి వచ్చాయి అని వెదికాను. అక్కడే అంతు బట్టటం లేదు."

"ఏది ఒక ఉదాహరణ చెప్పు. లెట్స్ వాక్ త్రు," అంది లక్ష్మి.

"గత సంవత్సరం రెండో క్వార్టర్ రిజల్ట్స్ చూడు. అందులో కమోడిటీ మార్కెట్ లో భవిష్యత్తు లో మొక్కజొన్న ధరలకు కలిగే ఖరీదు మార్పులనుండి తమ ఆదాయాలకు ఎలాంటి దెబ్బ ఉండకూడదని అమ్మే ఆప్షన్స్ వ్యాపారంలో శాల్ బెర్గ్ కంపెనీ 150% రిటర్న్స్ చూపెడుతున్నది."

"అందులో తప్పేమీ కనపడడం లేదు. కొన్ని ఆప్షన్స్ లో ట్రేడర్లు 150% పైనే లాభాలు చేసుకున్నారు ఆ చికాగో మార్కెట్ లో ఆడి."

"అవన్నీ సరిగానే ఉన్నాయి. కానీ శాల్ బెర్గ్ కంపెనీ ఒక బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్మెంట్ మీద ఒకటిన్నర బిలియన్ ల ఆదాయం చూపెడుతున్నది. అంటే ఆ కంపెనీ ఒక బిలియన్ డాలర్ల విలువ ఉన్న ఆప్షన్స్ కొనే ఉండాలి కదా," అంది ఆయషా.

"అవును, సంఖ్యా పరంగా నువన్నది కరెక్టే. ఇక నీకు సమస్య ఎక్కడ వచ్చింది?"

"చికాగో ఎక్స్ఛేంజ్ కు వెళ్లి వాళ్ళ ఆప్షన్ ట్రేడింగ్ రెండో క్వార్టర్ లో పరిశీలించాను. 150% రిటర్న్స్ ఇచ్చిన ఆప్షన్స్ రెండు కనిపించాయి."

"గ్రేట్"

"కానీ ఆ రెండు ఆప్షన్స్ లో కూడా మొత్తం వ్యాపారం ఒక బిలియన్ డాలర్ల లోపే ఉంది."

లక్ష్మి కి ఆయషా కనుక్కున్న విషయం అర్థం అయ్యింది, " ఓహ్ మై గాడ్. అంటే శాల్ బెర్గ్ కంపెనీ ఆ ఆప్షన్స్ కొనకుండానే, కొన్నామని తప్పుడు లాభాలు చూపెడు తున్నారా?"

"అవును. అది ఒక ఉదాహరణ. అలాంటివే మరిన్ని దొరికాయి. ఎలా చూసినా, ఈ శాల్ బెర్గ్ కంపెనీ ఆర్థిక వ్యవహారాలు లోతుగా పరిశీలిస్తే అవకతవకలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నేను రీసెర్చ్ చేసి సోదోహరణగా ఈ వివరాలన్నీ ఒక రిపోర్ట్ లాగా రాశాను. నీకు పంపిస్తాను. చదివి నీ అభిప్రాయం చెప్పు," అంది ఆయషా

"గ్రేట్ వర్క్ ఆయషా. నన్ను చదవనీ. ఇలాంటి విషయాలు బయట పెడితే మన కంపెనీకి పేరు తో బాటు, మనం చేస్తున్న ఈ ప్రో బోనో పనుల వల్ల మనకూ ఆత్మ సంతృప్తి లభిస్తుంది," అంది లక్ష్మి.

"అలానే ఈ రిపోర్ట్ ను ఏమి చేయాలో కూడా చెప్పు," అడిగింది ఆయషా.

"చేసేదేముంది? రిపోర్ట్ సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ రెగ్యులేటర్ ఎస్.ఈ.సి కి పంపించు. వాళ్ళు పరిశోధించి ఆ కంపెనీ ని, మూయించేస్తారు."

" ఐ హోప్ సో."

"మరీ అలా నిరాశ జనకంగా చెప్తున్నావెంటీ?"

"శాల్ బెర్గ్ కంపెనీలలో డబ్బు పెట్టుబడి పెట్టిన వారి జాబిత చూసాను. అందరూ హేమా హేమీలే. అటువంటి కాంటాక్ట్స్ ఉన్న కంపెనీ మీద దాడి చేయడం, నాకు అనుమానం గానే ఉంది."

"అందుకే, నన్ను కూడా ఒక సారి నీ రిపోర్ట్ చదవనీ. నీ నంబర్లు కూడా మరో సారి చెక్ చేస్తాను. ఇలాంటి

విషయాలు బయట పడినప్పుడు, మొదట ఆ విషయాలు బయట పెట్టిన వారిలోనే తప్పులు పడతారు. ఈజీ టు షూట్ ది మెసెంజర్ ," అంటూ నవ్వింది లక్ష్మి.

"ఎప్పటిలా ఈ రోజు అరుణోదయం అందంగా అయ్యింది. పక్షులు కిల కిల రాగాల బిజీఎం తో అందరినీ లేపడం అయ్యింది. ప్రపంచంలో అంతా బాగానే ఉందని పిప్ప పాప పాడుతున్నది. నువ్వేం డల్ గా ఉన్నావు," ఆయషా ను ఆట పట్టిస్తూ లక్ష్మి అంది.

"అబ్బే ఏమీ లేదు," నవ్వుతూ మాట తప్పించేయాలని ఆయషా ప్రయత్నించింది.

"కాదు. ఏదో దాస్తున్నావు. పెళ్లి గురించి మీ అమ్మతో మళ్లీ గొడవ పడ్డావా?"

"అదీ ఒక కారణం"

"మరో సారి స్వయంవరమా?"

"స్వయంవరం లాగా ఉన్నా సరిపోయేది. ఏదో ఒక విల్లు పెట్టి, ఎత్తమని చెప్పి, పనికిరాని వాళ్ళనందరిని ఏరి పారేసి ఉండవచ్చు. మా అమ్మ పుణ్యమానని, ఆ ఏరి పారేయడం మా అమ్మ నాతో మొదట చెప్పినప్పుడొక సారి, ఇక మా అమ్మ పోరు భరించలేక ఆ అబ్బాయిని కలిసి మరోసారి చేయాల్సి వస్తుంది."

"ఈ సారి ఎవరిని కలిసావు?"

"సాంప్రదాయ కుటుంబం, దూరపు చుట్టాలు, ఇక్కడే పి.ఎచ్.డి చేస్తున్నాడని ఫోటో పంపించింది. అది ఆప్ లో చూస్తూనే ఎడం పక్క తోసేసే ముఖం, పరిచయం. ఆ మాట చెప్తే అమ్మ నమ్మదు. కలిసి చూడవే బాగానే ఉంటాడు అంటుంది. 'బాగానే' అంటూనే అది ఒక కాంప్రొమైజ్ అని అర్థం చేసుకోదు. సరే గత్యంతరం లేక గత వారాంతం ఫ్లైట్ లో ఆ అబ్బాయి ఉన్న ఊరికి వెళ్లి కలిసా."

"ఎలా ఉన్నాడు?"

“ఏముంది, హాస్టల్ లో వుండి చదువుతున్న అబ్బాయి లాగా ఉన్నాడు. సరిగా డ్రెస్ కూడా చేసుకోలేదు. మాటల్లో, చేష్టల్లో మగవాడనే అహంభావం తెలుస్తూనే వుంది. అంతా తన సొదే. నా గురించి ఏమీ తెలుసుకోవాలని ప్రయత్నించలేదు,” ఆయషా ముఖం లో అయిష్టత అంతరంగాలలో నుంచి తన్నుకొచ్చి తారాడుతోంది.

“సరే అర్థం అయ్యిందిలే. అమ్మకేమి చెప్పావు,” లక్ష్మి నవ్వేసింది.

“మళ్లీ ఆ అబ్బాయికి నుండి టెక్స్ట్ రాలేదని, ఆ అబ్బాయికి నచ్చలేదని చెప్పాను.”

“నీ ముఖంలో దాచలేని ఎక్స్ప్రెషన్ చూసి ఆ అబ్బాయి మళ్లీ నీకు టెక్స్ట్, ఫోన్ చేసే సాహసం చేసి ఉండడు లే,” అంటూ నవ్వేసింది లక్ష్మి.

బ్రేక్ అప్ ముందు అరసు తో గడిపిన గతం గుర్తుకు వచ్చి ఆయషా మొఖం లో తిరిగి అంధకార ఛాయలు అలుము కున్నాయి.

లక్ష్మి కి ఆయషా, అరసుల బ్రేక్ అప్ గురించి తెలుసు. మాట తప్పించడానికి, “పెళ్లి ఒక సమస్య అన్నావు. ఇంకా చాలా సమస్యలు ఉన్నాయా?,” కవ్వింపు గానే అడిగింది.

“ఇదిగో పొద్దున్నే ఈ న్యూస్ చదివాను,” ఆయషా తన ఫోన్ లో నుంచి ఆ న్యూస్ లింక్ లక్ష్మి ఫోన్ కు పంపించింది.

‘ రిటైర్ మెంట్ కమ్యూనిటీల డైరెక్టర్ లీసా మరణం‘

నగరంలో మూడు రిటైర్మెంట్ కమ్యూనిటీలు కట్టి, నడుపుతున్న లీసా నిన్న రాత్రి రోడ్డు ప్రమాదం లో మరణించారు. తను అతి వేగంగా నడుపుతున్న కారు అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న చెట్టు గుద్దు కోవడంతో ఈ మరణం సంభవించిందని పోలీసులు చెప్పారు. తన మొత్తం ఆస్తి, సమయం రిటైర్ అయ్యిన వారి సౌకర్యం కోసం వెచ్చించిన లీసా మరణం పై రిటైర్మెంట్ కమ్యూనిటీ లలో నివసిస్తున్నవారు, నగరం లోని ప్రముఖులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కేసు ఇంకా పోలీసు విచారణ లో ఉంది.

“వెరీ సాడ్. నీకు లీసా తెలుసా? ఎలా?” అడిగింది లక్ష్మి.

"నేను ఇది వరకు పనిచేసిన మేకిన్సీ కంపెనీలో నా బాస్, మెంటార్ అనిత. ఆవిడ గురించి నీకు ఇది వరకే చెప్పాను. అనిత అమ్మ లీసా"

"మరి అనితతో మాట్లాడవా?"

"ఆ. విన్నది నిజమేనా అని తెలుసుకోవడానికి, తన బాధ పంచుకోవడానికి చేసాను. అనిత ఆ లీసా తన తల్లి నేనని చెప్పింది"

"ఎలా ఈ ఏక్సిడెంట్ అయ్యిందో అడిగావా?"

"అడిగాను. అనిత వాళ్ళ అమ్మ కథ చెప్పుకొచ్చింది. లీసా తండ్రి లేని తన పిల్లలు అనిత, అనిత తమ్ముడిని బాగా చదివించింది. ఇద్దరూ పిల్లలు బాగా సెటిల్ అయ్యిన తరువాత, తన శేష జీవితం రిటైర్ అయ్యిన వారి సంక్షేమం కోసం వెచ్చించాలను కుంది. తను చేరిన స్టార్ట్ అప్ కంపెనీ పుణ్యమా నని, లీసా కు డబ్బు కొదువేమి లేదు. స్టాక్ ఆప్షన్స్ లో మిలియన్ల దొరికాయి. ఈ రిటైర్మెంట్ కమ్యూనిటీలు కట్టడానికి, కొంత డబ్బు ఆ మిలియన్స్ లలో నుంచే ఖర్చు పెట్టింది. మిగిలిన డబ్బు అంతా తనకు తెలిసిన ఒకరికేవరికో ఇచ్చిందని విన్నాను. ఆ వ్యక్తి ఆ డబ్బు మీద ఇచ్చే ఆదాయంతో ఈ కమ్యూనిటీలు నడుపుతున్నది. ఆ వ్యక్తి ఎవరో లీసాకు బాగా తెలిసిన వ్యకినేనని అనిత నమ్మకం."

"నమ్మకం అంటున్నావు. అనితకు తన తల్లి ఆస్తి పాస్తుల వివరాలు తెలియదా?"

"చూచాయగా తెలుసు. కానీ పూర్తి వివరాలు తెలియవు. తన తరువాత తన ఆస్తులు పంచడానికి, చూసుకోవడానికి ఒక ట్రస్ట్ నెలకొల్పింది"

"ట్రస్ట్ అంటే, నీ ఫ్రెండ్ అనిత కు సమస్యలేమీ ఉండవు. లీసా మరణానంతరం ఏమి చేయాలో ట్రస్ట్ డీడ్ లో చక్కగా వివరించి ఉంటారు."

"అనిత కు వచ్చిన సమస్య ఆ ట్రస్ట్, ఆస్తుల పంపకాలు కావు."

"ఇంతకీ, అనిత సమస్య ఎంటి?" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"లీసా ఇలాంటి ఏక్సిడెంట్ చేసుకునే మనిషి కాదంటోంది. లీసా కారు వేగంగా నడపడం, అనిత తాను ఎప్పుడు చూడ లేదంది. ఏదో ఫౌల్ ప్లే ఉంది తన అనుమానం. నా సాయం కోరింది. అనిత మాటలు విన్న తరువాత నేనూ తన విషాదంలో చిక్కుక పోయాను. అదే నీకు కనిపించి ఉంటుంది."

"మరి సాయ పడొచ్చు కదా?"

"ఇది పోలీసుల కేసు. నేను ఇలాంటి కేసుల మీద ఏమి పని చేయగలను? చేయడానికి, నాకు ఇక్కడేమి కనిపించడం లేదు."

"అలా ఎందుకనుకుంటున్నావు? లీసా బాగా డబ్బున్న మనిషి లాగే ఉంది. లేకపోతే ట్రస్ట్ నెలకొల్పాల్సిన పని ఉండదు. ఇలాంటి కేసులలో లీసా మరణా నికి ట్రిగ్గర్స్ వెదుకు. తన మరణం వల్ల ఎవరు లాభ పడతారు అని ఆలోచించు. నువ్వు కనుక్కున్న విషయాలు, నీ ఫ్రెండ్ అనిత కు తనకు కావాల్సిన క్లోజర్ ఇవ్వగలదు. స్నేహితులకు సాయపడటం సంతోషమే కదా. బీ చీర్ ఫుల్."

"నువ్వనది కరెక్టే. కానీ ఎక్కడ మొదలు పెట్టడం?"

"ఫాలో ది మనీ, ఎప్పటి లాగే. మన కంపెనీలో ఎలా 20% టైము ప్రో బొనో పనులు చేయ వచ్చు కదా. ఆ టైమ్ లో నీ ఫ్రెండ్ అనిత కోసం ఈ పని చేయి," లక్ష్మి ఆయషా తో అంది.

డబ్బులు వచ్చే ప్రోజెక్ట్ ల పై పని చేయకుండా వదిలేసే ప్రసక్తి లేదు. డబ్బు లిస్తున్న క్లైంట్ లు, పని ఎంత వరకు వచ్చిందని అడుగుతూనే ఉంటారు. సామాజిక హితవు కోరి చేస్తున్న ప్రో బోనో ప్రోజెక్ట్ లను అదే లెవెల్ లో పని చేయాలంటే, కమిట్మెంట్ ఉండాలి. అది లక్ష్మి, ఆయషా లకు ఇద్దరికీ ఉంది. ఎలానూ ప్రోబోనో పనుల ప్రసక్తి వచ్చిందని మిగిలిన పనుల స్టేటస్ కూడా లక్ష్మితో మాట్లాడాలనిపించింది.

తను పని చేస్తున్న ప్రోబోనో పనుల స్టేటస్ రిపోర్ట్ తన కంప్యూటర్ తెర మీదకి తెచ్చి చూడ సాగింది ఆయషా. శాల్ బెర్గ్ కంపెనీ మార్కెట్ లో చేస్తున్న అవకతవక పనులపై సోదోహరణా లతో ఎస్.ఈ.సి మార్కెట్ రెగ్యులేటర్ కి పంపించిన తర్వాత, ఆ కంపెనీ విచారణ లో ఉన్నట్లు ఎటువంటి వార్త రాకపోవడం, ఆయషా కు ఆశ్చర్యం, ఒక్కింత నిస్పృహ కలిగించాయి. అందుకే ఎదురుగా ఉన్న రిపోర్టులో కూడా ఈ కేసు ముందుకెళ్ళలేదని, హై లైట్ అయ్యింది.

"లక్ష్మి, నేను శాల్ బెర్గ్ కంపెనీల మీద చేసిన రీసెర్చ్ బూడిదలో పోసిన పన్నీరు అయ్యేటట్లు ఉంది. మనం పంపించిన రిపోర్ట్ పై ఎస్.ఈ.సి నుండి ఎలాంటి స్పందన లేదు," అడిగింది ఆయషా.

"అవును కదా. కొన్ని రోజుల క్రితం లారెన్స్ తో ఈ కేసు మాట్లాడుతున్నప్పుడు, ఎస్.ఈ.సి కేసుల మీద పని చేస్తున్న తన తోటి ఎఫ్.బి.ఐ ఆఫీసర్ ను అడిగాడు. మన కంపెనీ తరఫున నువ్వు పంపిన రిపోర్ట్ మీద ఎన్రికో అన్న మరో ఆఫీసర్ పని చేస్తున్నాడట. లారెన్స్, ఎన్రికో కూడా తనకు తెలిసిన వాడే, మంచి ఇన్వెస్టిగేటర్ అన్నాడు," అని లక్ష్మి ఆయష కు జవాబు చెప్తూనే, లారెన్స్ కి ఫోన్ చేసింది.

"లారెన్స్ ఎలా ఉన్నావు. క్విక్ క్వశ్చన్. గతంలో శాల్ బెర్గ్ కంపెనీ గురించి మాట్లాడాను కదా. ఎన్రికో పని చేస్తున్నాడన్నావు. ఆ పని ఎంత వరకు వచ్చిందో తెలుసా?"

"తెలీదు. కానీ వాటే కోఇన్సిడెన్స్! ఎన్రికో ప్రేమలో పడ్డాడు. తన గర్ల్ ఫ్రెండ్ తో బాటు ఈ వారాంతం టాంపా కు వెకేషన్ మీద వస్తున్నాడు. ఎక్కడైనా రెస్టారెంట్ లో కలుద్దామన్నాడు. మనం ఎన్రికోను, తన గర్ల్ ఫ్రండ్ ను ఎలానూ కలవాలి. నీ ప్రశ్న కు సమాధానం కూడా తెలుసుకోవచ్చు."

"ఆయషాను కూడ రెస్టారెంట్ కు పిలిస్తే పరవాలేదు కదా," అంది లక్ష్మి.

"తప్పకుండా. ఎక్కడ కలువాలో ఎన్రికో తో మాట్లాడిన తరువాత చెప్తాను లే."

ఆయషా ను చూసి, "విన్నావు కదా, ఈ శుక్రవారం సాయంత్రం ఎన్రికో ని కలిసినప్పుడు నేరుగానే మన ప్రశ్నలు అడుగుదాములే," అంది లక్ష్మి.

శుక్రవారం సాయంత్రం ఏడుకి 'టికి బార్' లో కలుద్దామన్నాడు, లారెన్స్. టాంపా డౌన్ టౌన్ గుండా ప్రవహించే హిల్స్ బోరో నది గట్టున చాలా రెస్టారెంట్ లు ఉన్నా, లారెన్స్ 'టికి బార్' ఎన్నుకోవడానికి కారణం గురించి పెద్దగా వెదకాల్సిన పని లేదు.

గడ్డి, వెదురు, తాటాకుల తో కట్టిన పర్ణశాల ఒక పడవలాగ నీటి పై తేలుతూ ఉంటే, ఆ తెప్ప పై కొన్ని టేబుల్ లు వేసి అప్పటికప్పుడు వండిన వంటకాలు, కావాల్సిన విధంగా చేసిన ట్రాపికల్ కాక్ టైల్స్ తో వడ్డిస్తూ వుంటే, టికీ దీపాల వెలుతురు లో డౌన్ టౌన్ అందాలు నదిలో నుంచి చూస్తూ తిరగడం, తినడం రొమాంటిక్ గా ఉంటుంది.

ఏడుకు ఒక పది నిమిషాల ముందే, ఆయషా, లక్ష్మి, లారెన్స్, ఎన్రికో, తన కొత్త గర్ల్ ఫ్రెండ్ సోఫియా కన్వెన్షన్ సెంటర్ పక్క నున్న ఆరో నంబర్ బోట్ రాంప్ దగ్గరికి చేరారు. ఎడుగంటలకి, టంచనుగా 'టికీ బార్' బోట్, వీరున్న రాంప్ దగ్గరికి వచ్చి వారిని ఎక్కించు కుంది.

లారెన్స్ ఎన్రికోని లక్ష్మి కి, ఆయషా కు పరిచయం చేశాడు. తన కొత్త గర్ల్ ఫ్రెండ్ సోఫియా ను ఎన్రికో అందరికీ పరిచయం చేశాడు.

కెర్రీబియన్ రం తో చేసిన రకరకాల కాక్టెయిల్ లు తాగడానికి అందుబాటులో ఉన్నాయి. తినడానికి ఛాయిస్ తక్కువే. కానీ ఉన్న ఐటమ్స్ నే రుచిగా వండి వడ్డిస్తారని పేరు ఉంది. ఆ పడవ ఎక్కింది ఒక మరపురాని సాయంత్రానికి కాబట్టి, అది అయషా కు తప్ప, మిగిలిన వారికంతా అది దొరికినట్టే ఉంది.

అయషా ఆలోచనలు తను, అరసు కలిసి వెళ్లిన కెరీబియన్ క్రూయిజ్ వైపు మళ్ళాయి. ఆ అందమైన ప్రయాణం గుర్తుకు వచ్చింది. పక్కన అరసు లేక పోవడం గుర్తుకు వచ్చింది. మరో సారి అరసు నుండి విడి పోవడం సరైన నిర్ణయమే అని మనస్సు స్థిమిత పరచు కున్న తరువాత, శాల్ బెర్గ్ కంపెనీ లావా దేవీలు గుర్తుకు వచ్చాయి. మిగిలిన ఆలోచనల లాగా దీన్ని అంత సులువుగా తోసేయలేక పోయింది. ఒక వేళ తోసేస్తే, మళ్లీ అరసు ఆలోచనలు, చెప్పలేని అవేదన ముసురు కుంటాయి అని ఒక చిరు భయం.

ఎన్రికో, సోఫియాలు తాము ఎలా కలిశారు అని ఆనందంతో చెప్తున్నారు. సోఫియా శాల్ బెర్గ్ కంపెనీ కి పని చేస్తుంది. శాల్ బెర్గ్ కంపెనీలో ఉన్నత పదవులలో పని చేసే వారందరూ శాల్ బెర్గ్ బంధువులే. సోఫియా శాల్ బెర్గ్ మేన కోడలు. కంప్లయన్స్ డివిజన్ కి తనే హెడ్, అధికారి. లా చదవడం వల్ల, ఆ పని కి సోఫియా తగిన మానిషే. రెగ్యులేటర్ ల తో సోఫియా కు తరచూ పని ఉంటుంది. అలా ఎన్రికో తో సోఫియా పరిచయం పనితో మొదలయ్యింది. ఆ మాటలు విన్న వెంటనే లక్ష్మి, ఆయషాలు ఒకరిని, ఒకరు చూసి నవ్వు కున్నారు.

"ఎందుకు నవ్వుతున్నారు?" అడిగింది సోఫియా, వారి నవ్వు తో కలిపి అసంకల్పితంగా తనూ నవ్వుతూ.

"మా కంపెనీ అడిగిన ప్రశ్నలు మీ ఇద్దరికీ మన్మధ బాణాలు అవ్వుతాయి అని కలలో కూడా ఊహించ లేదు," అంది లక్ష్మి తన నవ్వు ఆపుకునే ప్రయత్నం చేస్తూ.

"నేనూ ఈ పని మొదలెట్టి నప్పుడు ఇలా ప్రేమలో పడతా ననుకోలేదు. సోఫియా ను కలవడానికి ముందు నేను తనతో ఫోన్ లో మాట్లాడం జరిగింది. అప్పుడే తన గొంతుకు పడిపోయాను. తరువాత తనను కలిసి నప్పుడు తన రూపం, ప్రవర్తన ఇంకా అందంగా అనిపించింది నాకు. ప్రేమ లో పడటం తప్ప మరో గత్యంతరం తోచ లేదు," అన్నాడు ఎన్రికో. సోఫియా ' అన్ని విషయాలు చెప్పేస్తావా?' అన్నట్లు చిరుకోపంతో, ఎన్రికో భుజం మీద చిన్న దెబ్బ వేసింది.

"మరి మీరు మొదలు బెట్టిన ఇన్వెస్టిగేషన్ పని సంగతేమిటి?" ఆయషా కొంచెం సంగ్దిద్దంగానే అడిగింది.

"నేను ఆ పని నుండి తప్పుకున్నాను. మా ఇద్దరి ప్రేమ బయట పడే తీరుతుంది. అప్పుడు మా ఇద్దరి పైన, మేము చేస్తున్న పని పైన లేని పోని అనుమానాలు రావడం ఇష్టం లేదు. మేము ఇద్దరం చేస్తున్న పనులలో కాన్ఫ్లిక్ట్ ఆఫ్ ఇంటరెస్ట్, అదే ఒక ఘర్షణ ఉందని అందరికీ తెలుసు. ఎంత ఆత్మ శుద్ది తో చేసినా, అపవాదులు రాక మానవు. అందుకే నేను కూడా మా డిపార్ట్మెంట్ కు నన్ను ఈ పని నుండి రిక్యూజ్ చేయమని, మరో పని ఇవ్వమని చెప్పాను. గత వారమే సైమన్ కు ఆ పని అప్పగించాను," అన్నాడు ఎన్రికో.

ఆయషా కళ్ళ లోని అర్థాలు లక్ష్మి పసి కట్టేసింది. శాల్ బెర్గ్ కంపెనీ మీద చేసిన ఆరోపణల మీద, ఎస్.ఈ.సీ. లో పెద్దగా ప్రోగ్రెస్ ఏమీ లేదు. డ్రింక్స్ రెండో రౌండ్ అయిపోయింది. అప్పెటైజర్స్ తినడం కూడా అయ్యింది. వాళ్ళ పడవ మరి కొందరిని ఎక్కించు కోవడానికి కన్వెన్షన్ సెంటర్ దగ్గరున్న పదో రాంప్ దగ్గర ఆగింది. ఎన్రికో, సోఫియా తాము దిగేసి క్లియర్ వాటర్ బీచ్ దగ్గరున్న పియర్ దగ్గరికి వెళ్తాం అన్నారు.

“ఆ బీచ్ పాతిక మైళ్ళు అవతల ఉంది. మీ కార్ పిక్ అప్ చేసుకోవాలి కదా. మళ్లీ మనం ఎక్కిన చోటే దిగాలి. ఇప్పుడు మనం నది మీద, డౌన్ టౌన్ కి ఆవలి చివర ఉన్నాం. ఒక మూడు మైళ్ళ అవతల ఉంది మన పార్కింగ్ గ్యారేజ్,” అన్నాడు లారెన్స్.

“అబ్బే ఉబర్ లో వచ్చాం. వెనక్కి పోనవసరం లేదు. ఇక్కడి నుంచే ఉబర్ తీసుకుంటాం,” అంది సోఫియా.

వాళ్ళు దిగిపోయిన తరువాత, “ వెకేషన్ మోడ్ లో ఉన్నట్టున్నరు. రాత్రంతా బార్ హాప్పింగ్ చేస్తారేమో,” అన్నాడు లారెన్స్.

“కొత్తగా లవ్ లో పడ్డారుగా. వాళ్ళిద్దరే సమయం గడపాలను కున్నారేమో,” అంది లక్ష్మి

“నేను కూడా ఇక్కడే దిగేస్తాను. ఈ నది వెంబడి నడవాలనిపిస్తున్నది. నాకు ఎక్సర్సైజ్ అవసరం కూడా,” అంటూ హడావిడిగా వీడ్కోలు తీసుకొని, రాంప్ వైపు వడి వడిగా అడుగులు వేసింది ఆయషా.

మనస్సులో మెదులుతున్న ఆలోచనలకి అదుపు లేదు. నది నుండి వీస్తున్న చల్లటి గాలి, నది వెంబడి నడవడానికి వేసిన పూల బాట, దారి చూపుతున్న అందమైన ఎలెక్ట్రిక్ దీపాలు ఆ ఆలోచనల నుండి ఆయషా కు విముక్తి ని ఇవ్వ లేక పోయాయి. నది మీద టికీ బార్ లో కూర్చుని తనకు చేతులు ఊపుతున్న లక్ష్మి , లారెన్స్ లను చూసి తనూ చేయి ఊపింది. వారిని అలా చూడడం ఆయషా లో ఈర్ష కలిగించక పోయినా, బాధను మాత్రం ఎక్కువే చేసింది.

పార్కేడ్ కు వెళ్లి అక్కడ ఐదో అంతస్థులో ఉన్న తన కార్ కోసం ఎలివేటర్ ఎక్కింది, ఆయషా తన కారు చేరి, దగ్గిరే పార్క్ చేసిన లక్ష్మి కారు కోసం వెదికింది. లారెన్స్ కూడా లక్ష్మి కారు లోనే వచ్చాడు. కారు లేదు. అప్పటికే, పడవ మీద వేగంగా ప్రయాణం చేసి, పార్కేడ్ చేరి, లక్ష్మి తన కారు తీసుకెళ్ళి పోయుండాలి. ఇక ఇప్పటి నుంచి మరో రెండు రోజులు, ఆఫీసు పోయేంత వరకు, వంటరి తనమే అనుకుంది ఆయషా నిట్టూర్పు తో.

అపార్ట్మెంట్ తలుపు తీసి చూస్తే ముచ్చట వేసింది, కానీ అది సంతోషం కలిగించ లేదు. ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టిన వస్తువులు. అందంగా అమర్చిన గదులు. ఆ అందం పంచుకొనే మనుష్యులను వెదకటానికి పోయినట్టుంది నా ఆనందం అనుకుంది ఆయషా.

పడుకోవటానికి రెడీ అవ్వుతుంటే, ఫోన్ వచ్చింది. ఇండియాలో ఉన్న అన్న సలీం నుంచి.

“చెప్పు సలీం”

“ఎలా ఉన్నావు నువ్వు? నిద్ర నుంచి లేపానా?”

“రాత్రి పదకొండు అవుతుంది. పడుకోవాలి. నీకు పొద్దున్న తొమ్మిదిన్నర కదా. నీ హాస్పిటల్ పని ఏమైయ్యింది?”

“పనులుండక ఎక్కడ పోతాయి? మధ్యలో తీరిక చేసుకొని మాట్లాడుతున్నాను.”

“అమ్మ పంపిన సంబంధం గురించేనా? అలా అయితే పెట్టేయి?” గొంతులో విసుగు ఏ మాత్రం దాచకుండా అంది ఆయషా.

‘అదీ ఒక కారణం అనుకో?”

“అలాంటి అబ్బాయిలను కలవ మని ఎలా పంపిస్తున్నారు సలీం?”

“నీకు ముప్పై దగ్గర పడుతోంది. అమ్మ కు దిగులుగానే ఉంది. అరసు తో తిరిగినంత వరకు తను బాగానే ఉండేది. నువ్వు బ్రేక్ ఆప్ అయ్యిన తరువాతే ఈ సమస్యలు.”

“బ్రేక్ అప్ కు నేను కారణం అంటావేమిటి?”

“అరసు నిన్ను మళ్లీ కలవాలని ప్రయత్నించడం నాకు తెలుసు. నువ్వే అతన్ని దగ్గరికి రానివ్వలేదు.”

“నేను నీలా నైతిక విలువల విషయంలో రాజీ పడలేను. అన్నీ తెలిసి, వాళ్ళ గ్రూప్ కు చెందిన హాస్పిటల్ చెయిన్ లో నీకు లాగా పని చేయలేను.”

“నా నిర్ణయాల పై నీవు అలా మాట్లాడం బాగా లేదు. నేను సిస్టమ్ లో ఉండే తోటి వారికి సహాయ పడడానికి ప్రయత్నిస్తాను, ఆ సిస్టమ్ లో మార్పులు తేవడానికి ప్రయత్నిస్తాను.”

“నేను నీలా కాంప్రొమైజ్ కాలేను. అలానే, అమ్మకు ఇలాంటి సంబంధాలు పంప వద్దని చెప్పు. “

“ఇప్పుడు కూడా, నువ్వు ఒప్పుకుంటే అరసు నీతో కలుస్తాడు. అక్కడేమి చేస్తావు? ఇండియాకి వచ్చేయి. అరసు ను పెళ్లి చేసుకో. రాణి లాగా బ్రతకొచ్చు.”

“అరసు అలా అనుకుంటే, ఆ సినిమా స్టార్ రీమ తో తిరుగుతాడా?”

“మరి బ్రేక్ ఆప్ అయ్యిన తరువాత ఏమి చేస్తాడు. నేను మాట్లాడినప్పుడంతా నీ గురించే అడుగు తుంటాడు. మీ ఇద్దరికీ ప్రేమ ఉంది. ఒప్పుకోరు. కలవరు. మధ్యలో నా మీద కోపం “

“ఫోన్ పెట్టెయి,” ఆయషా కోపంగా లైన్ కట్ చేసింది.

అలా మాటలు త్రుంచేయడం ఆయషా కు కొద్ది క్షణాలలో నే బాధ వేసింది. అలా సలీమన్న కాల్ ను కట్ చేసి ఉండ కూడదేమో. అరసు ను వదిలి ఉండ కూడ దేమో. మళ్లీ మరో వైపు తను చేసిన పని సరి అంటున్న మోరల్ పోలీస్ అంతరాత్మ. నిద్ర రాక ఆయషా, పరుపు మీద పొర్లి, పొర్లి చాలా సమయం తరువాత నిద్ర పోయింది.

కలలో ఒక ముసలి ఆవిడ కనిపించింది. ఆవిడ చెప్పకనే అది అనిత అమ్మ లీసా అని ఆయషా కు తెలిసిపోయింది. ఆవిడ శరీరం నిండా ఏక్సిడెంట్ వల్ల అయ్యిన గాయాలు ఉన్నాయి. 'నేనెందుకు చచ్చి పోయానో తెలుసా? తెలిసీ చెప్పకపోతే నీ తల వేయిముక్కలై పోతుంది' అంటూ గల గల నవ్వసాగింది. అలా తల తోకా లేని, భయంకరమైన పీడ కలలు ఆయషాకు చెమటలు పట్టేలా ఆ రాత్రంతా తరచూ వస్తూనే ఉన్నాయి. అరసు తో బ్రేక్ ఆప్ అయ్యిన తరువాతే ఈ పీడ కలల మొదలయ్యాయి. ఈ మధ్య వాటి దాడి కూడా ఎక్కువయ్యింది ఆయషా కు.

( ముగింపు వచ్చే సంచికలో)

Post your comments